క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



మహబూబాబాద్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో పారిశుద్ధ్యంపై చైర్మన్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని దానికి తగ్గట్టు పనులు చేపట్టాలన్నారు. ప్రధానంగా డ్రెయినేజీల్లో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వైఎస్ చైర్మన్ మార్నెని వెంకన్న , కమిషనర్ నోముల రవీందర్, ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల వేణు మాదమ్, బుజ్జి వెంకన్న పోతురాజు రాజు, బానోత్ హరిసింగ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేష్, గుజ్జు క్రాంతి పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



కేసముద్రం: రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటన మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్‌కి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి, తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై బ్రిడ్జి కుడివైపునకు దిగుతున్న క్రమంలో.. ఇదే మండలం కాట్రపల్లి ఉమ్మడిజీపీ శివారు శివశంకర్ నగర్‌కి చెందిన ఓ యువకుడు బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న ఆ ఇద్దరికి గాయాలు కావడంతో మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వృద్ధురాలికి..

గార్ల: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలికు తీవ్రగాయాలైన సంఘటన బుద్దారం క్రాస్‌రోడ్డు వద్ద శనివారం చోటుచేసుకుంది. గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన పుల్లమ్మ తన మనుమడు ఉపేందర్ బైక్‌పై పాపటపల్లి గ్రామంలో శుభకార్యానికి వెళ్తుంది. బుద్దారం క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొనడంతో పుల్లమ్మకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



దోర్నకల్: ప్రజలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ డీఈ పి.విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 8ఎంఏ సామర్థ్యం కలిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం డీఈ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్దేశం ప్రకారం 24గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈ హర్షి, ఏడీఈలు రమేష్, తిరుపతి, ఏఈలు కిరణ్, క్రాంతి, సబ్ ఇంజనీర్ అరవింద్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

స్కావెంజర్లను నియమించాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల ల్లోని ప్రభుత్వ పాఠశాలలను తెరిచే లోపు స్కావెంజర్లను నియమించాలని తెలంగాణ స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పాత స్కావెంజర్లతో కలసి శనివారం ఎంపీడీఓ బాలరాజుకు వినతిపత్రం అందించారు.

ఇంట్లో చోరీ

తొర్రూరు: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నితిన్ ఫౌండేషన్ భవన్ సమీపంలో నివాసం ఉండే అట్లూరి సోమేశ్వర్ కుటుంబ వ్యక్తిగత పని నిమిత్తం మండలంలోని అమ్మాపురం గ్రామానికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. మూడు తులాల బంగారం, రూ.30వేలు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఘనంగా హనుమాన్ జయంతి

మహబూబాబాద్ రూరల్: హనుమాన్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునుంచే భక్తులు అంజన్న దేవాలయాలకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు , ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ భక్త హనుమాన్ నామస్మరణతో ఆలయాలన్నీ మారుమోగాయి. వికాస తరంగిణి జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమంతుని గడ్డ అంజన్న దేవాలయంలో జరిపిన హనుమాన్ జయంతి పూజల్లో భక్తులకు శ్రీరామ కోటి పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు.

పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో అంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్త మండలి ప్రతినిధులు పసులేటి సుధీర్, రంగు శ్రీనివాస్, రంగు రాములు పాల్గొన్నారు.

కేసముద్రం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయానికి ఉదయాన్నే భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని, స్వామివారికి పండ్లు, పూలను సమర్పించి పూజలు చేశారు. దీంతో ఆలయాల్లో భక్తుల సందడి చోటుచేసుకుంది.

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని సీతారామంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పురవీదుల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు.

గార్ల: గార్లలోని తూర్పు ఆంజనేయస్వామి దేవాలయంలో 108 పర్యాయాలు శ్రీరామనామ భజన మండలి బృందంచే హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం ఆలయంలో 1000 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, రాంబాబు, వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, రంగారావు, అగర్వాల్ పాల్గొన్నారు.

దోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రధాన కూడలిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బూరుగుపాడు గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఊరేగించారు.

కురవి/దంతాలపల్లి/చిన్నగూడూరు: సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

తొర్రూరు: పట్టణంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి రేణిగుంట్ల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి సింధూర లేపనం చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



మహబూబాబాద్ రూరల్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో..



కేసముద్రం: కల్వల గ్రామంలో శోభాయాత్ర..



మహబూబాబాద్ రూరల్: అరటి పండ్లతో స్వామి వారి అలంకరణ



తొర్రూరు: ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



గార్ల: తూర్పు ఆంజనేయస్వామి దేవాలయంలో..



దోర్నకల్: ఉయ్యాలవాడ ఆలయంలో..



కురవి: గుండ్రాతిమడుగులో..



మరిపెడ: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

మరిపెడ రూరల్: ప్రైవేట్ పాఠశాల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, అందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. ఈసందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. మరిపెడ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్న విద్యాశాఖ అధికారులు మాముళ్ల మత్తులో మునిగిపోతున్నారని ఆరోపించారు. అడిగే వారు లేరని పలు పాఠశాల్లో ఇష్టానుసారంగా వేలకు వేలు ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల బుక్స్, యూనిఫాం పేరుతో యాజమాన్యం ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతు సొమ్ము చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. పాఠశాల ఫీజులు పేరుతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

కురవి: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గంధసిరి జ్యోతిబసు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

నెహ్రూసెంటర్: నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు మేలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నల్లపు సుధాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లిడి కోటయ్య, ధరావత బుజ్జి, శ్రీను, పెరుమాండ్ల పుల్లయ్య, వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, బిక్షపతి, వీరన్న, వెంకన్న, జోగ్యా, ప్రభాకర్ రెడ్డి, వీరభద్రం పాల్గొన్నారు.

ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో 64.19శాతం కంటే ఎక్కువ ప్రదర్శన చేసిన పార్ట్ టైం లెక్చరర్లను ఈ విద్యాసంవత్సరానికి పునరుద్ధరించాలని గురుకులాల కార్యదర్శి సర్కిల్ జారీ చేసిన విధుల్లోకి తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని, దీనికి సంబంధించిన ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమా నాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో గుగులోత్ భీమా నాయక్ హాజరై మాట్లాడుతూ.. గురుకులాల సెక్రెటరీ ఆర్డర్లను బేఖాతరు చేస్తున్న ప్రిన్సిపాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవకతవకలకు పాల్పడుతున్న ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాందాస్, డీఎస్ బాలునాయక్, స్వప్న బాయి, శ్రీను, శివవర్మ నాయక, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమా నాయక్

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం సీపీఐ ఆధ్వర్యంలో మరో ఉద్యమం చేపడతామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సీఎం కేసీఆర్‌తో కొట్లాడి బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరు చేసి, శంకుస్థాపన చేయించారని పేర్కొన్నారు. తీరా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి పాలవడంతో, బ్రిడ్జి నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం సంబంధిత రాష్ట్ర మంత్రితో మాట్లాడి నిర్మాణం పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాగం లోకేష్, రాగం రమేష్, కృష్ణమూర్తి, జనార్దన్, వీరన్న, శివ, రమేష్, సక్రు, నాగయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

నెల్లికుదురు: నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే ఎంతటి వారైన చర్యలు తప్పవని తహసీల్దార్ కోడిచింతల రాజు, ఎస్సై క్రాంతికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల షాపులను శనివారం మండల టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డితో కలసి తనిఖీలు నిర్వహించారు.

దోర్నకల్: మండలంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణవేణి హెచ్చరించారు. మండలంలోని అమ్మపాలెం రైతువేదిక భవనంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. అనంతరం డోర్నకల్‌లోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మురళీమోహన్, సీఐ బి.ఉపేందర్‌రావు, ఎస్సై తిరుపతి, ఏఈఓలు అవినాష్, ఎర్ర కర్ణ, రవికుమార్, ఆర్ఐ బానోత్ రామా పాల్గొన్నారు.

పెద్దవంగర: నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని తహసీల్దార్ మహేందర్, వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్ హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్‌లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని విత్తన, పురుగుమందుల దుకాణాలపై స్థానిక ఎస్సై మహేష్‌తో కలసి తనిఖీ చేశారు.



నెల్లికుదురు: తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం

బయ్యారం: మండలంలోని కొత్తపేట-గంధంపల్లిలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించిన ఏఓ రాంజీ, అదనపు ఎస్సై మౌలానా పలు రిజిష్టర్లను, విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను మండల టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఎస్సై వంశీధర్, ఏవో వెంకన్న శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజేందర్, సుమన్ పాల్గొన్నారు.

కొత్తగూడ: మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల షాపులను మహబూబాబాద్ ఏడీఏ లక్ష్మినారాయణ శనివారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఓ ఉదయ్, ఏఈఓ రాజులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కేసముద్రం: ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కేసముద్రం రైల్వేస్టేషన్‌లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం రైల్వేస్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై గుర్తుతెలియని వ్యక్తి స్పృహకోల్పోయి పడి ఉండగా, రైల్వే అధికారులు 108కి సమాచారం అందించారు. ఇంతలో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతన్ని పరీక్షించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. కాగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ప్రయాణపు టికెట్ లేదు. మృతుడి వయస్సు 55-60 సంవత్సరాలు ఉంటుందని, 5.6ఎత్తు, చాతిపై పుట్టుమచ్చ కలిగి ఉండి, వైట్ కాలర్ ఫుల్ షర్ట్, బూడిద రంగు పాయింట్ ధరించినట్లు తెలిపారు. కాగా అనారోగ్యంతోనే అతడు మృతి చెందాడని, ఈ మేరకు మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు.

‘బడిబాట’ను జయప్రదం చేద్దాం

నెల్లికుదురు: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 3నుంచి 19 వరకు చేపట్టనున్న బడిబాట కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని ఎంపీడీఓ బాల రాజు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం విద్యాశాఖ, ఐసీడీఎస్, ఐకేపీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ రాందాస్, ఎంపీఓ పార్థసారథి, ఏపీఎం వరదయ్య, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచాలి

మరిపెడ: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచాలని మండల ప్రత్యేక అధికారి సుధాకర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖతోపాటు అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. ఈనెల 3నుంచి 11వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ పాల్గొన్నారు.

తొర్రూరు: పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ తెలిపారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బడిబాట కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ మహంకాళి బుచ్చయ్య, ఎంపీఓ గౌస్, ఏ సీడీపీఓ ఇందిర, ఏపీఎం సంజీవరావు, వైద్యాధికారి జ్వలిత, ఏఈ అరుణ తేజ్, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనుబాబు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న డీపీఎం



పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుమాధవ్

మహబూబాబాద్ రూరల్: జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమానికి ప్రతీ ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని డీఆర్డీఏ డీపీఎం నళినినారాయణ అన్నారు. బడిబాటపై పలు ప్రభుత్వ శాఖల సమన్వయ ప్రత్యేక సమావేశం జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం నళినినారాయణ మాట్లాడుతూ.. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే బాధ్యతను తమ సొంత పనిగా భావించినప్పుడే నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించగలుగుతారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో విద్యా శాఖ మండల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంపీఓ హరిప్రసాద్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఏపీఎం తిలక్, సీసీలు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో గల జిల్లాప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఎంపీడీఓ వివేక్‌రామ్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిబాట విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీదేవి, డీటీ శ్రీలత, ఎంపీఓ అప్సర్‌పాషా, ఏపీఎం దివాకర్ రాయ్ పాల్గొన్నారు.

పెద్దవంగర: బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా జూన్ 3వ తేదీ నుంచి 19 వరకు బడిబాట చేపట్టుతున్నామని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మండలంలోని పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, నోడల్‌హెచ్ఎం కళాధర్, ఏపీఎం రమణాచారి, సీసీలు, సీఏలు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూసెంటర్: ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లోని గెస్ట్ ఫ్యాకల్టీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి పనితీరును కనబర్చిన జూనియర్ లెక్చరర్ల సేవలను పునరుద్ధరించాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ లెక్చరర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

సదస్సును జయప్రదం చేయాలి

బయ్యారం: ఈనెల 9న కొత్తగూడెంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఫోరం జాతీయ కన్వీనర్ సత్యం శనివారం పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం

నెహ్రూసెంటర్: ఏఐటీయూసీ అనుబంధ హౌజ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికుడు ప్రమాదవశాత్తు అంగవైకల్యం కాగా ఆయన కుటుంబానికి యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్థికసాయంతోపాటు బియ్యాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలితమే తెలంగాణ

పెద్దవంగర: అమరుల త్యాగఫలమే తెలంగాణ సిద్ధించిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుంపల సమ్మయ్య అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో అమరవీరుల స్థూపం నుంచి గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సోమయ్య, రఘు, శ్రీనివాస్, షర్ఫుద్దీన్, వేణు, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో భవిష్యత్

కురవి: క్రీడలు భవిష్యత్‌కు ఉపయోగపడుతాయని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌లో సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంపు చివరి రోజు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో కె.రవికుమార్, హెచ్ఎం రవికుమార్, పీఈటీ సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు దామోదర్, బీకు, సురేష్, రవికుమార్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద పిల్లలకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచి బడులు తెరిచే లోపు పనులన్నీ పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న తెలిపారు. మండలంలోని బంజర, శ్రీరామగి, హేమ్లాతండా ప్రభుత్వ పాఠశాలలను శనివారం సందర్శించి పనులను పరిశీలించారు.


అక్రమంగా చేపల లూటీకి యత్నం

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి గ్రామసమీపంలోని సూరారం చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు దిగి చేపలను పట్టేందుకు యత్నిస్తుండగా, విషయం తెలుసుకున్న మత్స్యకారులు చెరువు వద్దకు చేరుకుని వారితో వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో మత్స్యకారులు 100కి ఫోన్ చేయడంతో, సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అప్పటికే ఆ గుర్తుతెలియని వ్యక్తులంతా బైక్‌లపై పరారయ్యారు.

తునికి చెట్ల నరికివేతపై జరిమానా

గూడూరు: మండలంలోని పారెస్టు రేంజ్ పరిధిలో చిన్నఎల్లాపురం అటవీ ప్రాంతంలో శనివారం కొంతమంది తునికాకు కూలీలు అక్రమంగా పెద్ద పెద్ద తునికి చెట్లను నరికి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. డీఆర్ఓ శ్రీనివాస్ రెడ్డికి సమాచారం అందడంతో పారెస్టు సిబ్బందితో చేరుకుని పరిశీలించాడు. బాధ్యులను గూడూరు పారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించి జరిమానా విధించినట్లు తెలిపాడు.

కొండగట్టుకు అంజన్న భక్తులు



గూడూరు: అంజన్న మాలధారులు ఇరుముడితో శనివారం కొండగట్టు పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. 41రోజుల పాటు కఠోర దీక్ష చేసిన భక్తులు హనుమన్ జయంతి రోజులన దీక్ష విరమణ చేయనున్నారు. కార్యక్రమాల్లో గురుస్వాములు మెరుగు మల్లయ్య గౌడ్, భానుశాస్త్రి పాల్గొన్నారు.